క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరగనుంది. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష జరుగుతుందని ఎంపీడీఓ శ్రీరమ్య తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ రైల్వేట్రాక్ వద్ద రోడ్డుకు మరమ్మతులు చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ ఎస్వీ జానారెడ్డి సూచించారు. దేవీనగర్ రైల్వే ట్రాక్ వద్ద గోతులు పడిన రోడ్డును శుక్రవారం వీఎంసీ ఈఈ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేట్రాక్ అండర్ బ్రిడ్జి వద్ద గోతులు పడటంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ రోడ్డును సరిచేయాలని వారు కోరుతున్నారు.

ఎంపీ కేశినేని శివనాథ్‌కు సత్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఎంపీని గజమాలవేసి సత్కరించారు. విజయవాడ లెనిన్‌సెంటర్‌లోని పార్కులో ఏర్పాటు చేస్తున్న కృష్ణ కాంస్య విగ్రహానికి సహాయ, సహకారాలు అందించాలని ఫ్యాన్స్ కోరారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారని ఫ్యాన్స్ అధ్యక్షుడు సుధాస్వామి తెలిపారు. చిన్నిని సత్కరించిన వారిలో విజయ్, తరుణ్, సాయిచరణ్, వాసు తదితరులు ఉన్నారు.

రషీద్ హంతకులను కఠినంగా శిక్షించాలి

ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వినుకొండలో రషీద్‌ను హతమార్చిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హత్యా రాజకీయాలు మంచిది కాదని, ఇటువంటి వాటిని ప్రోత్సహించడం సమాజానికి పెనుముప్పు అని హెచ్చరించారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, మైనార్టీ శాఖ మంత్రి ఫారుక్‌లు ఘటనపై స్పందించాలని.. రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి దారుణాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మద్యం తాగొచ్చి భర్త పెడుతున్న వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీనగర్‌కు చెందిన అన్నం ప్రసన్నకుమార్, వాంబేకాలనీకి చెందిన బొమ్మశాలి ఝాన్సీలకు రెండేళ్ల క్రితం వివాహమైంది. నాటి నుంచి ప్రసన్నకుమార్ ఎటువంటి పనికి వెళ్లకుండా నిత్యం మద్యం సేవించి వచ్చి భార్యను వేధిస్తూ ఉండేవాడు. గురువారం రాత్రి కూడా ఇదే విధంగా ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించడంతో మనస్తాపానికి గురైన ఝాన్సీ ఇంట్లో ఉన్న పలు రకాల టాబ్లెట్లు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల సమాచారంతో ఆమెను పోలీసులు ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించి వైద్య సాయం అందించారు. ఝాన్సీ తల్లి శివకుమారి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

నైట్‌షెల్టర్ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిద్రించే నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే నైట్ షెల్టర్లను నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద, వీఎంసీ వెహికల్ డిపోవద్ద ఉన్న షెల్టర్‌ను నిర్వహించేందుకు ఎన్జీవోలు, నిరాశ్రయుల సమిష్టి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సమాఖ్యలు, ఉమెన్ అండ్ యూత్ కమ్యూనిటీ బెస్ట్ గ్రూప్‌లు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, పబ్లిక్/ప్రైవేటు సెక్టార్ కంపెనీలు, అసోసియేషన్‌లు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పట్టణ సామాజికాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి(యూసీడీ పీవో)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రోగాలను తరిమికొడదాం

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం
- వారంలో ఒక రోజు డ్రైడే



మధురానగర్ అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించి ఇంట్లోని నీటి నిల్వలను మార్చివేయాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి సూచించారు. మధురానగర్‌లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ జరిగింది. స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణతో కలిసి ర్యాలీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలతో దోమలు పెరుగుతాయని డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం డివిజన్‌లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో

28వ డివిజన్ భానునగర్‌లో శుక్రవారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం – రోగాలను తరిమికొడదాం అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ జరిగింది. కార్పొరేటర్ వీరమాచనేని లలిత ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దోమలు ఎలా పెరుగుతాయి.. వాటిని ఏ విధంగా నియంత్రించాలి అనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో నేతలు కిషోర్, ఏఎస్ఎం జాస్మిన్, పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): వానాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని, జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. వీటిపై నాలుగు డివిజన్లలో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రైడే–ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి తొట్టెల్లో నీటిని తొలగించారు. డెంగీ జ్వరం, మలేరియా వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కరపత్రాలను పంచారు. 61వ డివిజన్ 256 సచివాలయం పరిధిలోని మసీదు ఏరియాలో వైద్యసిబ్బందితో శానిటరీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరపీడితులపై ఆరా తీశారు. 62వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి వైద్య, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి డివిజన్లో ర్యాలీ నిర్వహించారు. 63వ డివిజన్లో ప్రత్యేక అధికారి జగదీశ్వరి ఆధ్వర్యాన, 64వ డివిజన్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ ఆధ్వర్యాన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఆశావర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.



భానూనగర్‌లో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వీరమాచనేని లలిత

అంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



శాకంబరీదేవిగా అంకమ్మతల్లి



పసుపు, కుంకుమ నీళ్ల బిందెలతో మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ నీళ్లను బిందెలతో సమర్పించారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు ప్రత్యేక పూజలు చేశారు. 21వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆ రోజు ఉదయం 8.30 గంటలకు సారె సమర్పణ చేస్తారని ఆయన తెలిపారు.

క్రీడల్లో సిద్ధార్థ వైద్య విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కాకినాడలో జరిగిన మోడరన్ పెంటాథ్లాన్ క్రీడలో బయోథ్లాన్, ట్రయాథ్లాన్ ఈవెంట్స్‌లో ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫైనలియర్ విద్యార్థి వి.నితీష్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభను కనపరిచారు. పోటీలో వెండి పతకం, రజత పతకం గెలిచి జాతీయ స్థాయి మోడరన్ పెంటాథ్లాన్ పోటీలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ డి.శ్రీనివాస్, డాక్టర్ ఆర్.నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బి.సుమైల, ఇతర సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రాము పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ప్రదర్శన



ప్రదర్శనలో వినియోగదారులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): లబ్బీపేటలో ఉన్న ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన నగర వాసులను ఆకట్టుకుంటోంది. ఈ నెల 22 తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన తెరచి ఉంటుందన్నారు. బెనారస్, చందేరి, చేనేత, పట్టు, కాటన్, చుడీదార్లు, టాప్స్, డ్రెస్ మెటీరియల్స్, కలంకారి, పోచంపల్లి, ఖాదీ, వెంకటగిరి, బెంగాలీ కాటన్, మంగళగిరి కాటన్ పట్టు చీరలు, నారాయణ్ పేట, ఉప్పాడ ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్ ఉంటాయన్నారు. కాంతా వర్క్ కాటన్, భగల్పూరీ సిల్క్, చాందిని సిల్క్, గుజరాత్ డిజైనర్, డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్స్, వరంగల్ టవల్స్, బెడ్ షీట్లు, రాజస్తాన్, జైపూర్ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ కాటన్ బెడ్‌షీట్స్ ఇలా వివిధ డిజైన్లు, రంగుల్లో డిస్కౌంట్ ధరలతో నగర వాసులకు అందుబాటులో ఉంచామన్నారు. చేనేత కార్మికులు వివిధ స్వయం ఉపాధి కార్మికులు తయారు చేసిన వస్తువులు, అలంకరణ సామగ్రిని కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాల్సిందిగా ఆయన కోరారు.

చెట్లకొమ్మల తొలగింపు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): దుర్గాపురం సాంబమూర్తి రోడ్డులో విరిగిపడిన చెట్ల కొమ్మలను శుక్రవారం ఉద్యానవనశాఖ సిబ్బంది తొలగించారు. ఇటీవల వర్షాలకు ఇక్కడ చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ శుక్రవారం చెట్లకొమ్మలు తొలగించరూ శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు పడిపోయిన చెట్ల కొమ్మలను తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్

రేపు 'సుఖమంచి'కి రంగస్థల పురస్కారం

విజయవాడ కల్చరల్: రంగస్థల నటుడు, దర్శకుడు సుఖమంచి కోటేశ్వరరావుకు తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంత్రం అందజేస్తున్నట్లు తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తంగిరాల ప్రసన్న చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంగిరాల ట్రస్ట్ స్వర్ణోత్సవం సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఠాగూరు గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామని వివిధ రంగాలకు చెందిన 20 మందిని స్మారక పురస్కారంతో సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అడిగోపుల మృతికి రచయితల సంఘం సంతాపం



విజయవాడ కల్చరల్: ఏపీ రచయితల సంఘం గౌరవ సలహాదారుడు, కవి, విమర్శకుడు అడిగోపుల వెంకటరత్నం మృతికి ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీ భవానీదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అడిగోపుల తిరుపతిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేశారు. 1984లో కవితా వ్యాసంగం ప్రారంభించి ఇప్పటిదాకా 25 కవితా సంపుటులు సూర్యోదయం అంచున కథా సంకలనం వెలువరించారు. ఆయన మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు అని ప్రకటనలో తెలిపారు.

పూరి నాట్యోత్సవంలో ప్రథమ స్థానం



కూచిపూడి నృత్యంలో ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన పూరీలో నిర్వహించిన శ్రీ పూరీ జగన్నాథ్ నాట్యోత్సవంలో కూచిపూడి విభాగంలో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని నీలిమ సత్తా చాటారు. ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. అంతేకాక ఇస్కాన్ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన పోటీల్లో సైతం కూచిపూడి విభాగంలో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నీలిమను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రోత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



స్వాగతం పలుకుతున్న ఐసీఏఐ సభ్యుల

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ చైర్మన్ నిట్టా రవికిషోర్ చెప్పారు. జూన్ 29న బెంగుళూరులోని ఐసీఏఐ ప్రధాన కార్యాలయం వద్ద మొదలైన ఎంఎస్ఎంఈ అండ్ స్టార్టప్–2024 బస్సుయాత్ర శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకుంది. ఈ బస్సుకు ఐసీఏఐ విజయవాడ చాప్టర్ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిట్టా రవికిషోర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై అవగాహన కోసం బస్సుయాత్ర అన్ని రాష్ట్రాల్లోనూ ప్రచారం చేస్తోందన్నారు. అందులో భాగంగా శుక్రవారం నగరానికి విచ్చేసిందని, తర్వాత తెలంగాణకు బస్సు వెళుతుందని చెప్పారు. ఐసీఏఐ విజయవాడ చాప్టర్ వైస్‌చైర్మన్ నారాయణ కంచమరెడ్డి, కార్యదర్శి జయంత్ ఉప్పులూరి, కోశాధికారి మనీష్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని గవర్నరుపేట, మొగల్రాజపురం, ఎంజీ రోడ్డులో ఈ బస్సు ప్రచారం నిర్వహించింది.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



అవగాహన సదస్సులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సేవల పోస్టర్‌లతో విద్యార్థులు, నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఎయిర్‌ఫోర్స్ విభాగంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ డాక్టర్ వెలగా జోషి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్స్‌లో విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. సేవ చేయడానికి యువత ముందుకు రావాలని సూచించారు. ఎయిర్‌ఫోర్స్ సికింద్రాబాద్ నాన్ కమిషన్డ్ ఆఫీసర్ ఎన్ సందీప్ ఎయిర్‌ఫోర్స్ విద్య, ఉపాధి అవకాశాలు గురించి వివరించారు. తొలుత అవగాహన సదస్సును కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీ శర్వాణి, అధ్యాపకులు లలిత ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరచాలి

రాష్ట్ర కో ఆర్డినేటర్ జె.సునీత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల స్థితిని పొందుపరచాలని అంగన్‌వాడీ కేంద్రాల రాష్ట్ర కో ఆర్డినేటర్ జె.సునీత అన్నారు. పోషణ ట్రాకర్ అప్లికేషన్ నిర్వహణ, నమోదు పర్యవేక్షణలో భాగంగా అంగన్‌వాడీకేంద్రాల రాష్ట్ర కో ఆర్డినేటర్ జె. సునీత నగరంలోని బాడవపేట, నెహ్రూ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల్లో పెరుగుదలను క్రమం తప్పకుండా ప్రతి నెలా పర్యవేక్షించడం చాలా ముఖ్యమన్నారు. పిల్లల్లో పోషకాహారలోపాన్ని ముందుగానే గ్రహించడానికి, సరైన పోషణను అందించడానికి తల్లిదండ్రులకు సహాయపడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి నెలా క్రమం తప్పకుండా పిల్లల సరైన ఎత్తు, బరువు వివరాలను అప్లికేషన్‌లో పొందుపరచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు కానీ అర్హులైన లబ్ధిదారులందరిని కలిసి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రోజువారీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాల వివరాలను క్రమం తప్పకుండా అప్లికేషన్ లో పొందుపరచాలని సూచించారు. పర్యవేక్షణలో విజయవాడ సెక్టార్ సూపర్ వైజర్ రెహానా, కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాను పునరుద్ధరించండి

బార్ కౌన్సిల్ చైర్మన్‌కు బీబీఏ ప్రతినిధుల వినతి



వినతిపత్రం ఇస్తున్న బీబీఏ ప్రతినిధులు

విజయవాడస్పోర్ట్స్: న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరించాలని, సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) విషయంపై న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డికి బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి, కార్యదర్శి పద్మావతిని బీబీఏ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. గతంలో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని పునరుద్ధరించి న్యాయవాదుల కుటుంబాలకు అండగా ఉండాలని, సీవోపీపై న్యాయవాదుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో బీబీఏ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, ఎ.శివరామప్రసాద్(రాజా), కోశాధికారి ఎస్.వి.వి.సుబ్రహ్మణ్యం, కె.కాంత్రికుమార్ ఉన్నారు.

నేటి నుంచి అపూర్వ బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో

పటమట(విజయవాడతూర్పు): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యాన ఈ నెల 20, 21 తేదీల్లో లబ్బీపేటలోని ఎస్ ఎస్ కన్వెన్షన్‌లో అపూర్వ- బిల్డింగ్ మెటీరియల్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఐఐఏ ఏపీ శాఖ చైర్మన్ విజయభాస్కర్ తెలిపారు. లబ్బీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో, ఇంటీరియల్స్ ఇన్నోవేటివ్ ఉత్పత్తుల విస్తృత శ్రేణిలో ప్రదర్శించబడే ఎక్స్‌పోను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనలో వివిధ సెమినార్స్ నిర్వహణ, ఆర్కిటెక్ విద్యార్థుల థీసిస్ అవార్డులు, విద్యార్థులు రూపొందించిన ఉత్పత్తుల ప్రదర్శన, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్కిటెక్స్, ఇంజినీర్ల ప్రసంగాలు ఉంటాయన్నారు. రెండు రోజులపాటు జరిగే ప్రదర్శన నగరవాసులకు ఉచితమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌పో పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో సంయుక్త కార్యదర్శులు ప్రొఫెసర్ కె.సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాస్, అసోసియేషన్ ట్రెజరర్ కె. విజయ ఆనందకుమార్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సర్వశక్తి స్వరూపిణి దుర్గాదేవి



కనకదుర్గ వైభవంపై ప్రసంగిస్తున్న పద్మాకర్

విజయవాడ కల్చరల్: సర్వశక్తి స్వరూపిణి కనకదుర్గాదేవి అని ఆధ్యాత్మికవేత్త పద్దిపత్తి పద్మాకర్ అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆషాఢమాసం తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో రెండురోజులపాటు నిర్వహించే శ్రీ కనక దుర్గ వైభవం అంశంగా శుక్రవారం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ దుష్టసంహారం చేయడం కోసం జగజ్జనని శ్రీ కనక దుర్గాదేవికి అవతరించిందన్నారు. పురాణాల్లోనూ కనకదుర్గమ్మను మహామహిన్విత శక్తిగా భావించారన్నారు. అమ్మను నమ్ముకుంటే ఆమె మన వెంటనే ఉంటుందని, అమ్మ అవాజ్య కరుణామూర్తిగా అభివర్ణించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన దుర్గగుడి ఈఓ రామారావు మాట్లాడుతూ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేబీఎన్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు జిల్లా కర్నూరు జిల్లా నందికొట్కూరుకు చెందిన సాయి లక్షిత బృందం కూచిపూడి నృత్య సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. ప్రసంగం వినడానికి సాయంత్రం 5 గంటలనుంచే భక్తులు వేదిక జరిగే స్థలికి చేరుకున్నారు. సమాచారం ఇచ్చేవారులేక పోవడంతో వారు ముందు సీట్లలో కూర్చోవడంతో ఏఈవో సుధారాణి వారిమీద ఆగ్రహం వ్యక్తంచేశారు. మిమ్మల్ని ఇక్కడ ఎవరు కూర్చోమన్నారు అంటూ చిందులు వేశారు.

భగవతీ శాకంబరీ..



ముగురమ్మల మూలపుటమ్మ.. ప్రకృతిమాత శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రిపై శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కదంబం ప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తజనం కూరగాయలను అందజేశారు. భక్తబృందాలు అమ్మవారికి సారె సమర్పించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



